
సాక్షి
పల్నాడు
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6213 టీఎంసీలు. ఎగువ నుంచి 13,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1198 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు యథావిధిగా పాఠశాలలు

గుంటూరు డీఈవో పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు శనివారం యథావిధిగా పనిచేస్తాయని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. గత నెలలో సంక్రాంతి సెలవుల్లో నష్టపోయిన పనిదినాన్ని భర్తీ చేయడంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 11న అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల పరిధిలో విద్యార్థులకు తరగతులు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు జరిగే విధంగా చూడాలని ఉపవిద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంలను ఆదేశించారు.

14న పీఎఫ్ పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యనిధి పెన్షనర్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 14వ తేదీ గుంటూరులోని కృష్ణనగర్‌లో ఉన్న ఈపీఎఫ్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్లు తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు, సమస్యలను తెలియజేసేందుకు వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో 9494657469 వాట్సాప్ నంబరుతో పాటు 0863–2344106, 2232921 నంబర్లను ఉపయోగించుకోవచ్చని సూచించారు. so.guntur@epfindia.gov.in మెయిల్‌కు పంపాలని తెలిపారు. వెబ్‌ఎక్స్ ఐడీ 26447532521కు పాస్‌వర్డ్ epgo*123 ద్వారా సైతం లాగిన్ కావచ్చని పేర్కొన్నారు.

జిల్లా జైలును పరిశీలించిన గుంటూరు ఎస్పీ



పట్నంబజారు(గుంటూరు): గుంటూరు జిల్లా జైలును శుక్రవారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. జైలు ప్రాంగణమంతా పరిశీలించి కారాగార భద్రతకు సంబంధించి అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖరరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆర్.వీరేంద్రప్రసాద్, జైలర్ సీహెచ్ కిరణ్, డెప్యూటీ జైలర్ వెంకటరత్నం, అరండల్‌పేట సీఐ రామానాయక్ తదితరులు ఉన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా స్థాయి (డీఎల్‌టీసీ, ఐటీఐ) శిక్షణాధికారి ఎస్.మధుసూదనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఎల్‌టీసీ, ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా ఆయా కోర్సుల్లో నిరుద్యోగ యువతకు రెండు నెలలు పాటు శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఈనెల 16లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆర్‌పీవీ మణిదీప్‌ను 80746 07278 నంబర్లో సంప్రదించాలన్నారు.

యార్డులో 1,13,546 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,02,730 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,13,546 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,485 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ సూపర్

- పల్నాడు పల్లెల్లో అందుబాటులో ఫ్యామిలీ ఫిజీషియన్
- లేవలేని స్థితిలో ఉన్న వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలు
- 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు
- పల్నాడు జిల్లాలో నిత్యం 28 గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలు

ఈ చిత్రంలో వృద్ధురాలి పేరు పెరుమాళ్ల నరసమ్మ. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామం. ఈమె బీపీ, అలర్జీ వ్యాధి కారణంగా ఇబ్బందులు పడుతోంది. కర్ర సాయం లేనిదే అడుగు వేయలేని పరిస్థితి. ఊర్లోకి డాక్టరొచ్చారనితెలిసి కర్ర సాయంతో శుక్రవారం వైద్య శిబిరం వద్దకు చేరుకుంది. డాక్టర్ ఉడత శ్రీలక్ష్మి కవిత ఆప్యాయంగా బామ్మ ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది ? అంటూ కుశల ప్రశ్నలు వేసింది. డాక్టరమ్మ నాకు బీపీ, కాళ్లంతా దురదలు వస్తున్నాయి, చూపించుకోవడానికి వచ్చాను తల్లి అని చెప్పింది. నరసమ్మ చేయి పట్టుకొని డాక్టర్ బీపీని పరిశీలించి అలర్జీకి మందులు ఇచ్చి వాడే విధానం చెప్పింది. ఒక్కసారిగా బామ్మ నరసమ్మ ముఖంలో చిరునవ్వు విరబూసింది. నెలనెలా మీరు రావడం వల్ల నాలాంటి ముసలోళ్లు ఊపిరి పోసుకుంటున్నారమ్మ. 104 వైద్య సేవలను, డాక్టర్ల పనితీరును బామ్మ ప్రశంసించింది.



వైద్య శిబిరంలో నరసమ్మకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీకవిత



నడవలేని వ్యక్తి ఇంటికి వెళ్లి సేవలు అందిస్తున్న వైద్య బృందం

సత్తెనపల్లి: దీర్ఘకాలిక వ్యాధితో గుమ్మం దాటలేని పరిస్థితి ఒకరిది.. చేతిలో నయా పైసా లేక వైద్యశాలకు వెళ్లలేని దుస్థితి ఇంకొకరిది.. దూరాభారంగా ఉన్న దవాఖానాకు వెళితే కూలి పని పోతుందన్న భయం వేరొకరిది.. దీంతో వ్యాధి ఒంటిని గుల్ల చేస్తున్నా.. ఇంట్లోనే సొంత వైద్యం చేసుకొంటూ కొందరు రోగం ముదర పెట్టుకుంటున్నారు. కొన్ని రోజుల తర్వాత వైద్యశాలకు వెళ్లేసరికి పరిస్థితి చేజారిపోతోంది. ఈ పరిస్థితుల నుంచి పేదలకు విముక్తి కల్పించి, ఇంటి వద్దే వైద్యం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించింది. పల్నాడు జిల్లాలోని పల్లెల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్నాడు జిల్లాలోని చాలా గ్రామాల్లో గతంలో వైద్యం అందని ద్రాక్షే. సుదూరంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లినా వైద్యుడు వస్తారో లేదో తెలియని దుస్థితి. మందులు ఉంటాయో ఉండవో చెప్పలేని పరిస్థితి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితులు పూర్తిగా మారాయి. విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. దీంతో మారుమూల గ్రామాల్లో సైతం వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా ఇంటి వద్దే వైద్య సేవలు అందించేందుకు వీలుగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమైంది. ధనవంతులకే సొంతమైన ఫ్యామిలీ డాక్టర్ పేదలకు కూడా అందుబాటులోకి రావడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దే 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులతో వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ విధానం ముఖ్యఉద్దేశం.

జిల్లాలో నిత్యం 28 చోట్ల ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు..

జిల్లాలో 28 మండలాల్లో 39 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 416 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. 104 వాహనాలు 28 ఉన్నాయి. జిల్లాలో 28 చోట్ల ప్రతి రోజు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలవుతోంది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకే షెడ్యూల్ ప్రకారం ఫ్యామిలీ డాక్టర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్, ఆశ వర్కర్లు, 104 వాహనంలో గ్రామానికి వెళ్తున్నారు. మొదట విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి విద్యార్థులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్నారు. అనంతరం గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తున్నారు. హెచ్‌బీ (హిమోగ్లోబిన్), ఆర్‌బీఎస్, మలేరియా, డెంగీ, వాటర్ టెస్టింగ్, ప్రెగ్నెన్సీ టెస్ట్, హెచ్ఐవీ, స్పూటమ్ ఫర్ ఏఎఫ్‌బీ, హెచ్‌బీఎస్ఏజీ, టెస్ట్ ఫర్ అయోడిన్ ఇన్ సాల్ట్ టెస్ట్ వంటి పరీక్షలు చేస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు.

గుంటూరు డీఎంహెచ్‌ఓగా డాక్టర్ శ్రావణ్‌బాబు



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ శ్రావణ్‌బాబును నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ సుమయఖాన్‌పై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి జనవరి 9న ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జె.హనుమంతరావుకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు శుక్రవారం డాక్టర్ హనుమంతరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు ప్రస్తుతం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రేపల్లె సమీపంలోని బెల్లంవారిపాలేనికి చెందిన డాక్టర్ శ్రావణ్‌బాబు గుంటూరు వైద్య కళాశాలలో 1988లో ఎంబీబీఎస్, విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో 2011లో పీజీ డీసీహెచ్ చేశారు. గుంటూరు జిల్లా అప్పికట్లలో 1998లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. బాపట్ల పీపీ యూనిట్, పొన్నూరు, పాదిలిలో పలు హోదాల్లో పనిచేశారు. చీరాల ఏరియా ఆసుపత్రిలో పిల్లల వైద్యనిపుణులుగా పనిచేశారు. డీఎంహెచ్‌ఓగా విధుల్లో చేరిన డాక్టర్ శ్రావణ్‌బాబును వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జె.హనుమంతరావు, ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

శుభమస్తు.. కల్యాణమస్తు

పేదింట వివాహానికి జగనన్న సాయం

- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా అందజేత
- 191 జంటలకు రూ.1.70 కోట్లు జమ
- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్



లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం ద్వారా 191 మంది జంటలకు రూ.1.70 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. పథకానికి ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించే కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. గత ఏడాది అక్టోబరు ఒకటి నుంచి డిసెంబరు 31 మధ్య వివాహాలు చేసుకొని అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, ముస్లింలకు షాదీతోఫా పథకం వర్తిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 78 మంది ఎస్సీలు, తొమ్మిది మంది ఎస్టీలు, 42 మంది బీసీలు, 55 మంది మైనార్టీలు, షెడ్యూల్ కులాల వారు ఇతర సామజిక వర్గాల వారిని వివాహం చేసుకున్న ముగ్గురు, వెనుకబడిన తరగతుల వారు ఇతర సామాజిక వర్గాల వారిని వివాహం చేసుకున్న ముగ్గురు, షెడ్యూల్ తెగల వారు ఇతర సామాజిక వర్గానికి చెందిన వారిని వివాహం చేసుకున్న ఒక్కరితో మొత్తం 191 మందికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు, చదువును ప్రోత్సహించడం కోసం పదో తరగతి నిబంధనను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ పథకానికి మూడెకరాల్లోపు మాగాణి, పదెకరాల మెట్ట, మాగాణి మెట్ట కలిపి 10 ఎకరాలున్న వారు మాత్రమే అర్హులన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు నెలసరి ఆదాయం కలిగిన వారికి మాత్రమే పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలు, ట్యాక్సీలు, ఆటోలు, ట్రాక్టర్లున్నా మినహాయింపు ఇచ్చిందన్నారు. విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్ల లోపు ఉండాలనే నిబంధన కూడా ఉందన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు కూడా అనర్హులని, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించిన నిర్మాణ ఆస్తి ఉండరాదని ప్రభుత్వం నిబంధనలను విధించిందన్నారు. ఈ సందర్భంగా నూతన జంటలను జిల్లా కలెక్టర్ దీవించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి బాలూ నాయక్, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులు నాయుడు, మండల కో–ఆర్డినేటర్ ఆర్.నాగలక్ష్మయ్య, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పథక లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్నకు చీరాల తలపాగా

మల్లన్న పెళ్లికి వేళాయె


- చీరాలలోని పృథ్వీ వంశస్తులకు నేసే భాగ్యం
- మూడు తరాలుగా వస్తున్న ఆచారం

చీరాల: శ్రీశైలం మల్లన్న పెళ్లికి తలపాగా సిద్ధమైంది. పరమశివుడిని పెళ్లి కొడుకుగా చేసేది మనవారే. శివరాత్రి రోజున చీరాల నేతన్న నేసిన తలపాగాను చుట్టిన తర్వాతే ఆయన పెళ్లి తంతు మొదలవుతుంది. ఈ అదృష్టం చీరాల చేనేత కార్మికుడికి దక్కడం ఈ ప్రాంతవాసులు అదృష్టంగా భావిస్తారు. ఏటా శివ రాత్రి నాడు మల్లన్న కల్యాణం నిర్వహిస్తారు. ఆయనను వరుడిగా తీర్చిదిద్దేందుకు పాగాలంకరణ చేస్తారు. శివరాత్రి లింగోద్భవ సమయంలో 10 నుంచి 12 గంటల మధ్య మల్లికార్జునస్వామి కల్యాణం చేసేందుకుగాను చీరాలలో తయారు చేసిన చేనేత వస్త్రంతో పెళ్లి కుమారుడిగా అలంకరణ చేస్తారు.

పృథ్వీ వంశస్తుల అదృష్టం..

మల్లన్నను పెళ్లి కుమారుడిగా అలంకరించే వస్త్రాన్ని నేసే మహద్భాగ్యం చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీలోని హస్తినాపురంలోని చేనేత కుటుంబానికి చెందిన 'పృథ్వీ'వంశానికి దక్కింది. పృథ్వీ వంశం మూడు తరాలుగా (వందేళ్లకు పైగా) ఈ ఆచారం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పృథ్వీ వెంకటేశ్వర్లు నలభై ఏళ్లుగా మల్లన్న వస్త్రాన్ని నేస్తూ ప్రతి శివ రాత్రి రోజున శ్రీశైలం వెళ్లి మల్లన్నకు అలంకరిస్తారు.

365 రోజుల పాటు నేత..



అలంకరించేందుకు సిద్ధం చేసిన తలపాగా

మల్లన్నను పెళ్లి కుమారుడిగా అలంకరించే ఈ వస్త్రాన్ని తయారు చేయాలంటే 365 రోజుల పాటు పని చేయాలి. రోజుకు ఒక మూర (అడుగున్నర) చొప్పున 365 రోజులు ఉపవాసం, నియమనిష్ఠలతో నేస్తారు. ఇందులో ఆయన కుటుంబ సభ్యులు పాలుపంచుకుంటారు. ఈ జగత్తును ఏలే శివపరమాత్ములు లోక కల్యాణం కోసం జరిగే మహాశివ రాత్రి రోజున ఆయనను పెళ్లి కుమారుడిగా అలంకరించేందుకు వినియోగించే తలపాగాను చీరాల ప్రాంతంలో నేయటం ఈ ప్రాంత వాసులు తమ అదృష్టంగా భావిస్తారు. ఇటువంటి అవకాశం చీరాల హస్తినాపురం ప్రాంతానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు వంశానికి దక్కడం గొప్ప విషయంగా ఈ ప్రాంత వాసులు భావిస్తున్నారు. తలపాగాను తీసుకొని పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం ఊరేగింపుగా శ్రీశైలం బయల్దేరుతుంది. పది రోజుల పాటు అక్కడే ఉండి లింగోద్భవ సమయంలో రాత్రి 11 గంటల సమయంలో ఒంటిపై నూలుపోగు లేకుండా గర్భగుడి నుంచి నవనందులను కలుపుతూ శిఖరం చుట్టూ ఈ పాగాతో చుడతారు. ఆ తర్వాతే శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి.

ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగంలో జిల్లా వాసి

- అన్ని దశల్లోనూ ఆయన పాత్ర
- ఏటీఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ పావులూరి సుబ్బారావు



పావులూరి సుబ్బారావు



అనంత్స్ సహకారంతో తయారు చేసిన రాకెట్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన అంటారిస్ జనస్–1 ఉపగ్రహం, ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 ప్రయోగ వాహనం విజయవంతం కావడం వెనుక గుంటూరు జిల్లా వాసి పాత్ర ఉంది. శుక్రవారం ఇస్రో ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 వాహనం ద్వారా విజయవంతంగా ప్రయోగించబడిన జనస్–1, ఈఓఎస్–7 అంతరిక్ష నౌకల తయారీకి జిల్లా వాసి పావులూరి సుబ్బారావు స్థాపించిన అనంత్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పూర్తి సహకారం అందించింది. ఇస్రోలోని చిన్న ఉపగ్రహ వాహకం (ఎస్ఎస్ఎల్‌వీ) ద్వారా ప్రయోగించబడిన అంటారిస్ జనస్–1 ఉపగ్రహం విజయవంతంగా కక్షను చేరుకుంది. దీనిలో ఉపయోగించిన 6యూ టెక్నాలజీ, ఉపగ్రహాన్ని రూపొందించడానికి, నిర్మించడానికి వినియోగించబడిన అంటారిస్ క్లౌడ్ సాఫ్ట్‌వేర్ వేదిక, ఎస్‌డీ లిక్స్ మాడ్యులర్ తయారీలో అనంత్స్ సంస్థ ప్రధాన వ్యవస్థల అనుసంధానకర్తగా వ్యవహరించింది. జనస్–1 అంతరిక్ష నౌకలోని పరికరాల సమీకరణ, కూర్పు, అనుసంధానం, పరీక్షలు అన్నీ (ఏఐటీ) బెంగళూరులోని అనంత్స్ ఏరో స్పేస్ పార్క్‌లో పూర్తి స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. జనస్–1లోని అత్యధిక సామర్థ్యం, గరిష్ఠ పరిమాణం గల సౌర ఫలకాలు అన్నీ అనంత్స్ సమకూర్చింది. జనస్–1 ప్రణాళిక నుంచి ప్రయోగం వరకు, రూపొందించడం నుంచి తయారీ వరకు ఇతర ఉపగ్రహాలతో పోల్చినప్పుడు 75 శాతం తక్కువ ఖర్చుతో 10 నెలల్లోనే నిర్మించడం ప్రత్యేకత అని సుబ్బారావు సాక్షికి తెలిపారు. సమయం ఆదా చేయడంలోనూ, ఖర్చును తగ్గించడంలోనూ దేశంలోని పరిశ్రమల్లో కెల్లా అత్యంత కీలకంగా వ్యవహరించామన్నారు. అనంత్స్ తిరువనంతపురం శాఖ ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 వాహక నౌకను తయారు చేయడంలో కీలక సహకారం అందించిందన్నారు. జనస్–1 ఉపగ్రహం తయారీలోనే కాకుండా కీలకమైన ఎన్జీసీ ప్యాకేజీలు, వీఎల్‌వీ డ్రై, పైరో కార్డుల తయారీలోనూ తోడ్పడిందన్నారు. ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 ప్రయోగంలో ఈఓ7–7 ఉపగ్రహం తొలి 'సేలోడ్' ఈఓఎస్–7కు కావలసిన ఐఆర్‌యూ, బీఎంయూ, ఎల్ఈఎంపి, డీసీ–డీసీ కన్వర్టర్లు లాంటి అనేక ఏవోయినిక్స్ వ్యవస్థలను బెంగళూరులోని అనంత్స్ అంతరిక్ష వాహక బృందం సమకూర్చిందని తెలిపారు.

మహిళా హక్కులే మానవ హక్కులు

సంఘటితంగా పోరాడాలి

- ఒంటరిగా ఏమీ సాధించలేం
- ముఖాముఖిలో ప్రముఖ రచయిత్రి ఓల్గా
- సాహితీ సుగంధాలు వెదజల్లుతున్న పుస్తక మహోత్సవం



పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద పుస్తకాలు చూస్తున్న యువత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు సహకార దృక్పథంలో ఉన్నప్పుడే వారి విముక్తి సాధ్యమవుతుందని ప్రఖ్యాత స్త్రీ వాద రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై ఓల్గాతో ముఖాముఖి కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలను సంఘటితం చేసే సంఘాలు లేవన్నారు.

చైతన్యం కలిగించే ప్రయత్నం..

'మహిళా హక్కులే మానవ హక్కులు' అనే నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశానన్నారు. నిస్సహాయస్థితిలో, అభద్రతతో ఉన్న మహిళలకు అండగా సాహిత్యం ద్వారా వారికి ఆలోచనలను కల్పించటానికి వారు ఉద్యమ బాటలో నడిచేందుకు తాను కృషి చేశానని ఓల్గా అన్నారు. అస్మిత సంస్థ ద్వారా 'మహిళావరణం' రచనను తీసుకొచ్చానన్నారు. అందులో చరిత్రలో విస్మరణకు గురైన మహిళలను గుర్తించి అందులో చూపించానన్నారు. దానికి చాలా పరిశోధన చేసినట్లు చెప్పారు. అదే విధంగా సంప్రదాయ సంగీతం, నాట్యం, సాహిత్యాలతో అభ్యుదయ భావాలను తెలియజేసేందుకు కృషి చేశానని అందులో భాగంగానే 'యుద్ధ–శాంతి' నృత్య రూపాకాన్ని రచించి విజయం సాధించానన్నారు. అంతేకాకుండా లక్ష్మణరేఖ రచన ద్వారా గృహహింసను ఎదుర్కొన్న మహిళా పాత్రలను వివరించానన్నారు. అదేవిధంగా విముక్త కథల ద్వారా రామాయణంలోని పాత్రల ద్వారా చాలా అంశాలను వివరించానన్నారు. ఎవరి మనోభావాలను దెబ్బతియకుండా ఇతర భావజాలం ఉన్న వ్యక్తులను సైతం ఆలోచింపజేసే విధంగా తాను ముందుకు సాగానని, అందులో విజయం సాధించానని వివరించారు. లిబరలైజేషన్ ఆఫ్ సీతా పేరుతో పలు బాషల్లోకి అనువధింపబడి తనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు. సాహితీవేత్తలు బండ్ల మాధవరావు, వరప్రసాద్‌లు సంధానకర్తలుగా వ్యవహరించారు.

సామాజిక ఇతివృత్తాల ఆధారంగా చలనచిత్రాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రఖ్యాత సినీ దర్శకుడు సత్యజిత్ రే సామాజిక ఇతివృత్తాలనే చలనచిత్రాలుగా తీసుకొచ్చారని ప్రముఖ సినీ దర్శకుడు అక్కినేని కుటుంబరావు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో సత్యజిత్ రే ప్రతిభా వేదికపై 'సత్యజిత్ రాయ్–జీవితం–సినిమా' అంశంపై చర్చా కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ బైస్కిల్‌థీవ్స్ చిత్రం సత్యజిత్ రేపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిందన్నారు. ఆయన తీసిన 'పథేర్ పాంచాలి' చిత్రం యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను తీసుకొచ్చిందన్నారు. 1935 నుంచి 1971 వరకూ సుమారు 36 చిత్రాలు తీసిన సత్యజిత్ రాయ్ చిత్రరంగానికి సుసంపన్నం చేశారన్నారు. ఆయనకు ఆస్కార్‌తో పాటు భారతరత్న వంటి పురస్కారాలు వరించాయన్నారు కార్యక్రమాన్ని సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు నిర్వహించారు.

సమస్యల పరిష్కారం కోసం కాలనీల్లో పర్యటన

డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్


స్థానిక ఎస్టీకాలనీలో ట్రాన్సిట్ వాక్ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ బి.బాలూనాయక్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగులో కీలకపాత్ర పోషిస్తున్న క్లాప్‌మిత్రల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్ పేర్కొన్నారు. ట్రాన్సిట్‌వాక్, కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ పద్ధతిని పరిశీలించారు. టాన్సిట్ వాక్ నిర్వహించి స్థానిక ఎస్టీకాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న గృహాలను పరిశీలించారు. అనంతరం వ్యర్థాల నుంచి సంపద తయారీ కేంద్రంలో క్లాప్‌మిత్రలతో కలసి కూర్చొని వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. తొలుత స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులతో గురువారం రాత్రి భోజనం చేశారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలోను మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, విద్యార్థుల భోజన పథకం తదితర అంశాలతో పాటు క్లాప్‌మిత్ర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. స్థానిక ఎస్టీకాలనీవాసులు సైడ్‌డ్రైన్స్ లేవని తన దృష్టికి తెచ్చారని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ గిరిధర్, ఏఓ కె.దేవదాసు, హౌసింగ్ ఏఈ రసూల్, సర్పంచి పరసా అంజమ్మ, కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అరుణ ప్రియ, ఏపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

డీఈఓ వెంకటప్పయ్య

నరసరావుపేట ఈస్ట్: జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య శుక్రవారం తెలిపారు. సెయింటాన్స్ పాఠశాలలో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా పరిధిలోని 28 మండలాలలో ఉత్తమ ప్రదర్శనలను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రదర్శనలలో ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్, ఆరోగ్యం- పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్-యాప్స్, పర్యావరణ మార్పులు, గణితశాస్త్రం- ఆధునికత అంశాలపై దాదాపు 140 ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు వివరించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన ప్రాజెక్ట్‌లను ఈనెల 27, 28 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత ఉపాధ్యాయులు తమ విద్యార్థులను, ప్రాజెక్ట్‌లను 15వ తేదీ ఉదయం 8గంటలకు సెయింటాన్స్ పాఠశాలలో హాజరయ్యేలా చూడాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్ (9032871234)ను సంప్రదించాలని సూచించారు.

వసతి గృహాల్లో రాత్రికి బస చేశారా? లేదా?

జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆరా


అధికారులతో కలసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్


నరసరావుపేట: జిల్లాలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన స్పెషల్ ఆఫీసర్స్ డే కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆరా తీశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు గురువారం రాత్రి ఆయా మండలాలలోని పంచాయతీలలో ఉన్న రెసిడెన్షియల్ వసతి గృహాల్లో బస చేసి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారా లేదా, చేసిన భోజనం ఎలా ఉంది, సకాలంలో వసతి గృహాలకు నాణ్యత కలిగిన బియ్యం ఇస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అలాగే శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మండల రెవెన్యూ అధికారులు, విద్యాధికారులు, ఎంపీడీఓలు, సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్లతో కలసి ఆయా గ్రామాలలో ట్రాన్సిట్ నడక నిర్వహించి ఎన్ని సమస్యలను గుర్తించి పరిష్కరించారో తెలుసుకున్నారు. జిల్లాలో మిషన్ శోభకృత్ కార్యక్రమంలో భాగంగా చెత్త, ప్లాస్టిక్, పేపర్, ఐరన్ వ్యర్థాలను గుర్తించాలని ఆదేశించారు. అదే విధంగా పాత భవనాలు, వాటి స్థితిగతులను బట్టి ఉండటానికి వీలు లేని వాటిని కూల్చి వేసే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీలను త్వరితగతిన అప్లోడ్ చేసే కార్యక్రమం వేగంగా పని చేయించాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఇళ్ల నిర్మాణంలో రూఫ్ లెవెల్ వరకు పూర్తయిన గృహాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉగాది నాటికి లబ్ధిదారులకు వంద శాతం ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా సత్వరం పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

వన సంరక్షణకు రూ.2 కోట్లు


స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ రామచంద్రరరావు

మాచర్ల: జిల్లాలో పూర్తి స్థాయిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరి పథకం కింద రూ.2 కోట్లను పల్నాడు జిల్లాకు కేటాయించి మొక్కల పెంపకంతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అటవీశాఖ జిల్లా అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. మాచర్ల రేంజ్ పరిధిలో ఆయన శుక్రవారం పర్యటించి స్థానిక ఫారెస్ట్ అధికారి రావు శేఖర్‌తో కలసి పలు ప్రాంతాలలో ప్లాంటేషన్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం రాత్రి అటవీశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పట్టణ పరిసరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు పూర్తిస్థాయిలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు నగరి పథకం చేపట్టటం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాలలో మొక్కల పెంపకానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందన్నారు. మాచర్ల రూరల్, వెల్దుర్తి, పట్టణ ప్రాంతాలలో పర్యటించి ఆయన మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు.

అశోక్‌కు ఏఎన్‌యూ స్ట్రాంగ్ మెన్ టైటిల్



సత్తెనపల్లి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ స్ట్రాంగ్‌మెన్ టైటిల్‌ను పట్టణంలోని ఏజీకేఎం కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న మాదాసు అశోక్ కుమార్ కైవసం చేసుకున్నాడు. ఏఎన్‌యూ అంతర్ కళాశాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 9న గుంటూరు ప్రభుత్వ ఉమెన్స్ కళాశాలలో నిర్వహించారు. వివిధ విభాగాల్లో మొత్తం 640 కేజీల బరువు ఎత్తి విశ్వవిద్యాలయ స్ట్రాంగ్ మెన్ టైటిల్‌ను పొందడమే కాక ఏఎన్‌యూ పవర్ లిఫ్టింగ్ జట్టుకు ఎంపిక అయ్యాడు. మార్చి 2 నుంచి 5 వరకు పంజాబ్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయంలో జరిగే ఆల్ ఇండియా అంతర్ విశ్వ విద్యాలయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు అన్నం సత్య నారాయణ, పాలకవర్గ సభ్యులు అన్నం రామారావు, అన్నం కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ రామిశెట్టి శ్రీనివాసరావు, పీడీ దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు దశల్లో ఏపీ ఎస్‌ఆర్‌ఎం బీటెక్ ప్రవేశ పరీక్షలు

మంగళగిరి: ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 2023 విద్యా సంవత్సరం బీటెక్ అడ్మిషన్లకు రంగం సిద్ధమైంది. మూడు దశల్లో ప్రవేశ పరీక్షల్ని నిర్వహించనున్నామని అడ్మిషన్స్ డైరెక్టర్ యలంపల్లి శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి దశ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 21, 22, 23 తేదీలు, జూన్ 10, 11 తేదీల్లో రెండో దశ, జులై 22, 23 తేదీల్లో మూడో దశ పరీక్షల్ని నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. మొదటి దశ ఎంట్రన్స్‌కు విద్యార్థులు ఏప్రిల్ 16వ తేదీలోగా, సెకండ్ ఫేజ్‌లో హాజరయ్యేవారు జూన్ 5, థర్డ్ ఫేజ్‌లో వారు జులై 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్ క్లాస్‌లో 60 శాతం మార్కులు, ఇంటర్మీడియెట్ మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఏపీ ఎస్‌ఆర్‌ఎం బీటెక్‌లో చేరేందుకు అర్హులని వివరించారు. ఎంట్రన్స్ టెస్ట్ రిమోట్ ప్రొక్టోర్డ్ పద్ధతిలో జరుగుతుందని పేర్కొన్నారు. అడ్మిషన్ల కోరు విద్యార్థులు ఎస్‌ఆర్‌ఎం వెబ్‌సైట్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఎస్‌ఆర్‌ఎంఏపీ.ఈడీయూ.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని ప్రొఫెసర్ శివశంకర్ తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్


నిందితులు, స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్‌ఐ పి.సురేష్

నకరికల్లు: పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ పి.సురేష్ వివరాలు వెల్లడించారు. మండలంలోని చల్లగుండ్లకు చెందిన కుంభా వీరబ్రహ్మయ్య, కుంభా సాంబశివరావు జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. నకరికల్లు, నరసరావుపేట, బల్లికురవ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈనెల 7వ తేదీన ద్విచక్ర వాహనం చల్లగుండ్ల హోటల్ వద్ద చోరీకి గురైందని కె.చినవెంకయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారని చల్లగుండ్ల బట్టీ వద్ద ద్విచక్ర వాహనాన్ని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. వీరి వద్ద నుంచి 17 ద్విచక్ర వాహనాలు, నకరికల్లులోని కొండపై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం హుండీ చోరీ కేసులో రూ.700 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రికవరీ చేసిన వాహనాల విలువ రూ.10లక్షలు ఉంటుందని చెప్పారు. కేసు ఛేదించడంలో సహకరించిన సిబ్బంది శ్రీధర్, పార్థసారథి, చెన్నకేశవ్, /ానయ్య, వెంకటేష్‌లను అభినందించారు.

కోటయ్య స్వామికి రూ.34.51 లక్షల ఆదాయం

గతేడాది కంటే రూ.4.60 లక్షలు అధికం


దేవస్థానంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండలో స్వయంభువుగా వెలిసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారము హుండీలు లెక్కింపు నిర్వహించారు. గతేడాది నవంబరు 24వ తేదీ నుంచి గురువారం వరకు 78 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.34,51,255లు, అన్నదానం హుండీ ద్వారా రూ.1,77,447 వెరసి మొత్తం రూ.36,28,702 కానుకలు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. గత సంవత్సర ఆదాయంతో పోల్చగా ప్రస్తుతము రూ.4,60,857లు అదనంగా వచ్చిందన్నారు. దీంతో పాటు 44.700 గ్రాముల బంగారం, 307 గ్రాములు వెండి ఆభరణములు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో ఇస్సపాలెం శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి.సుధాకరరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేశారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు ముక్కు వెంకటేశ్వర రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ మట్లా లింగారెడ్డి, వంగ శ్రీనివాస రెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త వారి ఏజెంట్ బాలాజీ సింగ్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, యల్లమంద బ్రాంచ్ మేనేజరు ఏ.యస్.ఎన్.రసూల్, బ్యాంక్ సిబ్బంది, కోటప్పకొండ ఔట్ పోస్ట్ యస్.ఐ. పి.మాచెర్లు, సూపరింటెండెంట్ నాగిరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీ భ్రమరాంబికా సేవా సమితి, శ్రీ సద్గురు సేవా సమితి సేవక బృందాలు పాల్గొన్నారు. హుండీల లెక్కింపు అనంతరము సదరు లెక్కింపు మొత్తాలను శ్రీ స్వామివారి ఎదుట కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి అర్చక స్వాముల సమక్షంలో చదివి వినిపించారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము


మాట్లాడుతున్న లాలుపురం రాము వేదికపై యార్లగడ్డ భాగ్యలక్ష్మి

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్ని బలోపేతం చేయాలని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము సూచించారు. స్థానిక కన్నావారితోటలో శుక్రవారం గుంటూరు కో-పరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీడీసీఎంఎస్) జిల్లా మహాజన సభ సమావేశం నిర్వహించారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, 2023-24 ఆదాయం, వ్యయానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. దాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పీఏసీఎస్ అధ్యక్షులు ఆయా ప్రాంతాల్లో అనుకూలమైన వ్యాపారాలు చేసి లాభాల బాటలోకి తీసుకురావాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 పీఏసీఎస్‌లు ఉండగా, అందులో 62 నష్టాల్లో ఉన్నాయని తెలిపారు. సంఘాలు ఏ వ్యాపారం చేయాలన్న పెట్టుబడి పెట్టడానికి జీడీసీసీబీ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. సొసైటీల్ని బలోపేతం చేయడానికి రోజుకు కనీసం ఒక గంట కేటాయించాలని సూచించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో సిబ్బంది సహకరించడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రాము మాట్లాడుతూ సహకరించని సిబ్బందికి వేతనాలు నిలిపి వేయాలని ఆదేశించారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సభ్యుల షేరు ధనం రూ.16.77 లక్షలు ఉందన్నారు. 2022-23లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 44 జీడీసీఎంఎస్ బ్రాంచీలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయడంలో పాటు లేపాక్షి నోటు పుస్తకాలు, స్టేషనరీ సంబంధించి రూ.61.95 కోట్ల వ్యాపారం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.97.90 కోట్ల విలువైన 47,824.04 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు ఎం.కృష్ణారెడ్డి, డి.రాజు, కె.హరిబాబు, ఎన్.రామయ్య పాల్గొన్నారు.